# మనసు అద్దంలో...

-డా॥ కేతు బుచ్చిరెడ్డి

మనిషికి మనసు సాక్షిలా, లోకానికి సూర్యుడు సాక్షిలా, అనంతపురం పట్టణానికి టవర్ క్లాక్ సాక్షిలా ఉంది.

నగరం నడిబొడ్డునలా కాకపోయినా, పట్టణం ప్రధాన కూడలిలో టవర్ క్లాక్, ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు అండగా, నీడగా నిల్చోనుంది. పట్టణాన్నంతా విహంగ వీక్షణం చేస్తున్నట్లుంది. పట్టణంలో ప్రతి ఒక్కరు ఏదో సందర్భంలో టవర్ క్లాక్ సెంటరుకు వస్తారు. కాబట్టి అనంతపురం పౌరులందరికీ టవర్‌క్లాక్ పరిచయమే! బంద్‌లు, ఊరేగింపులు, నిరాహార దీక్షలు అన్నీ తన కళ్ల ముందరే జరుగుతుంటాయి. తన కాళ్ల దగ్గరే పిచ్చికన్న మా తల్లి నగ్న, దీన, హీన బ్రతుకును; అనాథ బాలలు రాత్రిళ్లు తన ఒళ్లోకి చేరటం, పాలుపితికేసి, చాకిరీ చేయించుకుని, చివరికి గాలికి వదిలేసిన గోమాతలు, గాడిదలు తన ఒంటిమీద చుట్టిన అడ్వర్‌టైజ్‌మెంట్ వాల్‌పోస్టరు కాగితాలు నాలుకతో నాన్చి, పళ్లతో పీకి తినటం - ఇలా ఎన్నిటినో తన నాలుగు కళ్ల ముఖాలతో చూస్తూ నిశ్చలంగా, మౌనసాక్షిగా ఉంది టవర్ క్లాక్.

శ్రీ విష్ణు హోటల్ ముందు స్కూటరు నిలిపి, స్టాండు వేసి, టవర్ క్లాక్‌వైపు చూశాను. టైం మధ్యాహ్నం 12 గంటల 15 నిమిషాలు. నా వాచీ చూసుకున్నాను. 12 గంటల 30 నిమిషాలు. 1947 సంవత్సరంలో స్వాతంత్ర్య స్మారక చిహ్నంగా పుట్టిన టవర్ క్లాక్‌కు అపుడే ఏభై ఏడు ఏళ్ల వయస్సు మీద పడుతోంది కదా! అందుకేనేమో కాస్త ముసలిగా స్లోగా నడుస్తోందనుకున్నా!!

సూర్యుడు ఆకాశంలో నడినెత్తిమీదికి వచ్చాడు.

ఆదివారం కదా, కోడి లేకపోయినా, పకోడితో బాగానే సర్దుకుపోవచ్చు అనుకొని, హోటల్లోకి దూరాను. కౌంటరు దగ్గర ప్రొప్రయిటరుకు రెండు పకోడి పార్సెల్ కావాలని చెప్పాను. బెల్లుకొట్టి, వచ్చిన సర్వర్‌తో, "రెండు పకోడి పార్సెల్" అని గట్టిగా అరిచి తన పనిలో మునిగిపోయాడు. సీసాల్లో, టిన్నుల్లో, ఖరీదైన పానీయాల పొడర్లు క్యాష్ టేబుల్ మీద అందంగా, ధీమాగా కూచున్నాయి. హోటల్ యజమాని కుడి పక్క పాతకాలపు పెద్ద సందుంపెట్టె మాదిరి ఫ్రిడ్జ్ ఉంది. దాని పొట్టలో చల్లటి మజ్జిగ, రకరకాల రంగు రంగుల తియ్యటి, కమ్మటి, చల్లటి కూల్‌డ్రింక్సు, ఫ్రిడ్జ్ ప్రక్కన కొన్నిరకాల ఊరగాయల, పులిహోర, వాంగీ బాత్ ఇన్‌సెంట్స్, పొళ్లు, పచ్చళ్లు వగైరాలు సీసాల్లో, పాకెట్లలో లేబిల్స్ అతికించి ఉన్నాయి. పకోడీ పొట్లాలు వచ్చేలోపల ఊరికే ఉండడం ఎందుకని, వాటిని చూడ్డం మొదలుపెట్టి, పులిహోర ఇన్‌స్టెంటు సీసా ఒకటి చేతిలోకి తీసుకున్నా. ధర దానిమీదే రూ.పది అని ఉంది.

"బాగుంటుంది సార్. ఒకసారి రుచి చూస్తే వదిలిపెట్టరు. ధర కేవలం పది రూపాయలే" అన్నాడు హోటల్ యజమాని యాంత్రికంగా.

బ్రేవ్‌మంటూ కొందరు, ఉసూరుమంటూ మరికొందరు, చిల్లర కోసం జేబులు, పర్సులు తడుముకుంటూ కొందరు, నిర్లక్ష్యంగా టేబిల్ మీదికి పెద్ద పచ్చ నోట్లను విసిరేవాళ్లు కొందరు - అన్ని చిల్లుల్ని టేబిల్ మీది కడ్డీకి శిలువ వేసి, డబ్బుని టేబుల్ డ్రాయరులో వాటి అర్హతను బట్టి స్టీలు గిన్నెలోకి, క్లిప్పుల కిందికి తోసేస్తున్నాడు, వేసేస్తున్నాడు క్యాషియర్ కమ్ హోటలు యజమాని.

తినుబండారాల పట్టీ బట్టీ పెడుతున్నా, కాలక్షేపం కోసం, వడ, కాఫీ, టీ అన్నీ మూడు రూపాయలు, దోశె ఆరు రూపాయలు. ఏది ముట్టుకున్నా కనీసం మూడు రూపాయలుగా ఉంటోంది. వాటిని ముట్టుకుంటే చాలు చేతులు కాలుతాయి! ముట్టుకోకపోతే కడుపు కాలుతుంది! ధరలకు బతుకుకు ఎంత దగ్గరి సంబంధం. అయినా జనం కొంటున్నారు, తింటున్నారు, తాగుతున్నారు. ఆఁ అదే-టిఫిన్, కాఫీ, టీలు! ఇంతకన్నా ఏ రచయిత అయినా చక్కగా ఎలా చెప్పగలడు? ఈ మాట నా నోట రావటం నాకు థ్రిల్లింగ్‌గా ఉంది. పొద్దుపోనపుడు ఇలాంటి ఆలోచనలు నాకు బాగానే వస్తాయి!

ఇంకా పకోడి రాలేదు.

రంగు రంగుల స్వీట్లు ఒక ప్రక్కన అందంగా అద్దాల షోకేసులోకి చేరి అందరికీ నోరూరిస్తున్నాయి.

సర్వారాయుడు పకోడి పొట్లాలతో పాటు బిల్లు నా చేతిలో పెట్టి లోనికెళ్లాడు. "బిల్లు తీసుకోండి అన్నింటికి", 'అశ్వత్థామ హతః... కుంజరః" అని ధర్మరాజు అన్నట్లు, "అన్నింటికి" అని మెల్లగా చెప్పాను. ఇరవై రూపాయల నోటు, బిల్లు టేబిల్ మీదికి తోసాను. జనం రద్దీలో, రణగొణ ధ్వనిలో "అన్నింటికీ" అన్న నా మాట ఆయన చెవిని చేరకుండా, తిరణాల్లో పిల్లాడిలా తప్పిపోయింది! బిల్లు ప్రకారం రెండు పకోడీలకు

ఎనిమిది రూపాయలు తీసుకొని, పంద్రెండు రూపాయలు నా చేతికి అందించాడు. నా చేయి వెనక్కి లాగి కరెంటు షాకు తగిలినట్లయింది. లెక్కచేయలేదు. డబ్బుతీసుకొని జేబులోవేసుకున్నా. బయటికి నడిచాను.

చొక్కా పట్టుకొని, వెనక్కి లాగినట్లయింది. నెత్తిమీద కొట్టినట్లయింది. వెనక్కి తిరిగి చూసా. ఎవరూ లేరు!

గబ గబ స్కూటరు స్టార్టు చేయబోయా. స్లిప్ అయి చెప్పు తెగిపోయింది. అక్కడే హోటలు పక్కన చెప్పులు కుట్టే అతను ఉన్నాడు. అయినా అక్కడ అట్టేసేపు నిలబడదలచుకోలేదు!

"తప్పు కాదూ!" అన్న మాటలు నా చెవుల్లోనే చెప్పినట్లు వినిపించాయి. చుట్టూ చూశాను. ఎవరూ లేరు!!

అది నా మనసేనని అప్పుడు నాకర్థమయింది. "తప్పు! వెనక్కి వెళ్లి డబ్బు ఇచ్చిరా" అంటూ నన్ను గిచ్చుతోంది, గిల్లుతోంది. కొడుతోంది, కొరుకుతోంది. నసపెట్టుతోంది. గోలపెట్టి నానా రకాలుగా గయ్యాళి పెళ్లాంలా సాధిస్తోంది నా మనసు.

"బిల్లు తీసుకోండి – అన్నింటికీ" అని నేనన్నాను గదా!" తీసుకోకపోవడం అతని తప్పు. అన్నింటికీ అని చెప్పి ఇరవై రూపాయల నోటిచ్చాను గదా. మోసం చెయ్యాలనుకుంటే బిల్లు ప్రకారం ఎనిమిది రూపాయలు కాబట్టి పది రూపాయల నోటు నా దగ్గరే ఉంది, ఇచ్చి వుండేవాణ్ణి గదా. ఇరవై నోటు ఇవ్వడం అన్నింటికీ కలిపి తీసుకోమని నా అర్థం.

"పది రూపాయల నోటు ఇచ్చివుంటే నీ మూతి మీద కొట్టి వుండేవాడు. నీ చేతిలో పులిహోర ఇన్‌స్టెంట్ కి మనీ ఇవ్వలేదేమని, హోటల్ యజమాని నీ చొక్కా కాలర్ పట్టుకునేవాడు. ఇదీ ఒకరకంగా వైట్ కాలర్ క్రైమ్. తీసుకుంటే సరి, తీసుకోకపోతే డబ్బు మిగులుతుందని నీ వెధవ అభిప్రాయం. తెలివిగా ఎదుటివాడి పరిస్థితిని ఆసరాగా చేసుకొని మోసం చేయడం. హోటలు యజమాని మరిచిపోయినా గుర్తుచేసి మరీ ఇవ్వాల్సిన బాధ్యత నీకు లేదా?" – మనసు నన్ను నిలదీసింది.

"ఆఁ– వ్యాపారస్థులకు ఇదొక లెక్కా, జమా. అయినా ఆ హోటలు వాడు నీళ్ల కాఫీ, టీలు ఇచ్చి, పల్చటి పేపరు దోశెలు పోసి, చారులా కారిపోయే చట్నీ వేసి అందరి కడుపులు మాడ్చి సంపాదిస్తున్నాడు. వాడికి తగిన శాస్తి చేశాను" కాలరెగరేశాను.

"కుంటిసాకులు, కుళ్లు జోకులూ నీవూను" అంది మనసు.

ఏదైనా వస్తువు అడిగితే ఇవ్వకపోతే అరిచి గీపెట్టి సాధించుకునే మొండి, అల్లరి పిల్లాడిలా మనసు ఘోష పెడుతూనే ఉంది. "వెనక్కి వెళ్లి డబ్బు చెల్లించిరా" అంది మనసు.

"వ్యాపారం చేసేవాడికి వుండాలి ఆ మాత్రం జాగ్రత్త. ఇంద్రుడిలా ఒళ్లంతా కాకపోయినా ఉన్న రెండు కళ్లతో బాగా చూసుకోవాలి. నేను డబ్బు ఇచ్చినా తీసుకోకపోవడం అతని తప్పు. ఇందులో నా తప్పేం ఉంది?" అన్నాను.

అయినా మనసుతో మాటలు పెట్టుకుంటే హోటలు యజమాని నెమ్మదిగా గుర్తుతెచ్చుకొని, ఏ సర్వేశ్వరున్నో పంపి నన్ను పట్టుకరమ్మంటే డబ్బు పోతుంది, పరువు పోతుంది అనుకొని వెంటనే స్కూటరు స్టార్టు చేశాను. ఓవర్ బ్రిడ్జి అటువైపు వేపచెట్టు క్రింద ముసలాయనతో చెప్పు రిపేరు చేయించుకొని, అనవసరంగా ఖర్చయిందని తిట్టుకుంటూ రెండు రూపాయలు ఇచ్చి ఇల్లు చేరుకున్నా.

"చూశావా? తప్పుకు జరిమానా?" అంది మనసు.

"ఆఁ– చాల్లే, నోర్మూసుకో. అయినా ఎనిమిది రూపాయలు లాభం" అన్నాను మనస్సును ఉడికిస్తూ. అరిచి అరిచి అలసిపోయినట్లున్న మనసు నన్ను కాస్త ఊపిరి పీల్చుకోనిచ్చింది.

"పిల్లలూ! కాళ్ల చేతులు కడుక్కుని భోజనానికి రండి, మీ అందరికీ స్పెషల్" అనటంతో నా భార్య లక్ష్మితో సహా అందరూ డైనింగ్ టేబుల్ చుట్టూ బిలబిలమంటూ చేరారు.

"పులిహోర ఇన్‌స్టెంట్, పకోడి ఈ రోజు స్పెషల్. వేడి అన్నంలో ఎవరికి వారే ప్లేటులో పులిహోర తయారు చేసుకోవచ్చు" అని నేనే ముందుగా అన్నం మీద పులిహోర ఇన్‌స్టెంట్ వేసుకొని, మిగతా వాళ్లకి బాటిల్ అందించాను.

"అబ్బ! భలేగా ఉంది"

"వండర్‌ఫుల్‌గా ఉంది పులిహోర"

"బాగుందండీ, ఎపుడూ ఇదే తెస్తుండండి"

–భార్యా, పిల్లల ఏకాభిప్రాయం.

చేతితో కలుపుతుంటే తెల్లటి అన్నం మీద రక్తం గడ్డ పిసుకుతున్నట్లనిపించింది. అన్నం మెతుకులు, మిరప విత్తనాలు, జీలకర్ర, ఆవాలు, రక్తంలోని ఎర్ర, తెల్ల, ప్లేట్‌లెట్ కణాల్లా వేళ్లకి తగిలినట్లయి ఒళ్లంతా చల్లబడినట్లయింది. మళ్లీ కళ్లు చికిలించి చూస్తే చచ్చిన పురుగులు ముద్దగా ప్లేటులో పడి వున్నట్లు కనిపించింది. చేయి పెట్టాలంటే భయంగా ఉంది. తినలేక పోయాను. ప్లేటులో నీళ్లుపోసి చేయి కడుక్కున్నాను.

"ఏంటి డాడీ! అలా చేశారు" అన్నారు పిల్లలు.

"ఏంటండీ! మీకేమైంది. మీరేదో వింతగా ఉన్నా

రు?" అంది శ్రీమతి లక్ష్మి, నా చర్యను గమనిం, నా ముఖంలోకి చూస్తూ.

అవును వింతగా, వికారంగా, వికృతంగా, భయంకరంగా, జుగుప్సాకరంగా, దీనంగా, హీనంగా, దోషిగా ఉన్నాను. మనసు అద్దంలో నా బొమ్మ అలానే స్పష్టంగా నాకు కనిపిస్తోంది. నా మీద నాకు జాలి వేస్తోంది. అసహ్యం వేస్తోంది.

మనసు చెప్పటం మాని, చెయ్యటం మొదలుపెట్టిందన్న మాట అనుకున్నా.

భోంచేసిన తర్వాత కాసేపు మధ్యాహ్నం కునుకు తీయటం నాకు అలవాటు. నాతోపాటు నా శ్రీమతికి. పిల్లలు ఆడుకుంటున్నారు. మంచం మీద అటు ఇటు పొర్లాను. శ్రీమతి గాఢంగా నిద్రపోతోంది. నా గది నుండి బయటికి వచ్చాను. "ఏం డాడీ! నిద్రపోలేదా?" అన్నారు పిల్లలు.

"లేదురా, నిద్ర పట్టలేదు" అని, ఏదైనా చదువుదామని టీపాయ్ మీదన్న వారపత్రికలు తిరగేశా. వాటి మీద ధ్యాస కుదరలేదు. జోకులు నవ్వు పుట్టించలేదు. సినీతారల అర్ధనగ్న రంగు రంగుల ఫోటోలు ఆహ్లాదాన్ని కలిగించలేదు.

పాంటు, షర్టు వేసుకొని, తల దువ్వుకొని, బయటికి బయల్దేరుతుండగా, నిద్రనుండి మేల్కొన్న నా శ్రీమతి, అప్పుడే బయటికి వెళ్తున్నారు. కాఫీ తాగి వెళ్దురు గానీ ఉండండి" అంది.

"ఊc – త్వరగా వెళ్లు" అంది మనస్సు.

"తొందర చేస్తోంది. వెళ్లొస్తా" అన్నాను శ్రీమతితో.

అసూయతో, "అదెవతండీ!" అని అటూ, ఇటూ చూసి, ఎవరూ లేరని నిర్ధారించుకొని, "ఏమిటో మీ ధోరణి, ఉc – వెళ్లిరండి" అంది శ్రీమతి.

స్కూటర్‌లో శ్రీ విష్ణు హోటల్ చేరుకున్నా.

"పొరబాటున మీరు మధ్యాహ్నం పులిహోర బాటిల్‌కు డబ్బు తీసుకోవడం మరిచారు" అని డబ్బిస్తే, హోటలు యజమాని నా నిజాయితీని మెచ్చుకొని, నన్ను సాదరంగా ఆహ్వానించి, ఆయన ప్రక్కనే కుర్చీ వేయించి, థాంక్స్ చెప్పి, ఓ స్వీటు, హాటు తినిపించి, చక్కటి ఇన్‌స్టెంట్ కాఫీతో సత్కరిస్తాడని నా బుర్ర సినిమా స్కోపులో ఓ కలర్ సినిమా నాకు చూపిం చేసింది!

"ఛాల్లే! చెప్పు తీసుక కొట్టకపోతే సరి!" అంది మనసు.

"బుద్ధి చెప్పువాడు గుద్దితేనేమయా" అన్నాడు ప్రజా కవి వేమన. అందుకే నేను సహించి ఊరుకున్నాను.

హోటలు యజమాని పొరబాటును, ఏమరుపాటును గుర్తుచేసి, పది రూపాయల నోటును టేబిల్‌పై పెడితే, "ఓహో! అలాగా!" అంటూ ఏ భావం వ్యక్తం చేయకుండా, నా మొహం వంకయినా చూడకుండా, నోటు గల్లా పెట్టె నోటికందించాడు. మరుక్షణంలో బిల్లులు, డబ్బుల్లో మునకేసాడా మానవుడు!

అయినా నాకెంతో తృప్తిగా, హాయిగా ఉంది. నా మనసు తేలిక పడింది. ఇంతవరకు ఊపిరాడక ఉక్కిరి బిక్కిరి అయి నన్ను బాధపెట్టింది. బాధపడితే బాగుపడ తారంటుంది మనసు. "సెబాస్" అంటూ నా వీపు తట్టింది.

ఇల్లు చేరుకున్నాను.

కాంట్రాక్టు పని త్వరగా ముగించుకొని ఇంటికి వెళ్తున్న కూలీల్లా, శీతాకాలం సూర్యుడు లోకంలో తన దినచర్యను సవ్యంగా, సత్వరంగా పూర్తిచేసుకొని పడమట దిక్కున గల తన గూడును తృప్తిగా చేరు కున్నాడు.

దీపాలు వెలిగాయి.

భోజనం త్వరగా వడ్డించమన్నాను శ్రీమతిని.

"అపుడే తొందరేమండీ. ఓc – మధ్యాహ్నం భోం చేయలేదుగదా" అంటూ వడ్డించేందుకుపక్రమించింది.

వేడి అన్నంలో పులిహోర ఇన్‌స్టెంట్ బ్రహ్మాండంగా ఉంది. అమృతంలా రుచిగా ఉంది. లొట్టలేస్తూ బాటిల్ అంతా ఖాళీ చేశాను. శ్రీమతి నావైపు ఆశ్చర్యంగా చూస్తోంది.

బయటికెళ్లిన పిల్లలు వచ్చారు. తమని పిలవకుండా ముందు భోంచేస్తున్నందుకు, ఆబగా గబగబ తింటున్నందుకు వాళ్లు ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటున్నారు.

బ్రేవ్‌మంటూ బెడ్‌రూమ్ చేరాను.

అబ్బ! గుళ్లు గోపురాలు, గుళ్లో లింగం మింగే మహానుభావుల మనసుల అద్దాలు ఎన్ని చిత్రవధ వ్యథల్ని అనుభవించి వుంటాయో గదా అనుకున్నాను. మనిషి మనిషికి మనసు అద్దం స్వతస్సిద్ధంగా అమర్చబడి ఉంటుంది. అది రక్షగా, సాక్షిగా ఉపయోగపడుతుంది. అందులో వాళ్ల అసలు బొమ్మను చూడవచ్చు. కానీ అటువంటి రాక్షసుల, కుత్సితుల మనసు అద్దాలు ఎపుడో పెటేల్‌న పగిలిపోయి ఉంటాయి. అందుకే వాళ్లకు బాధల్లేవు, బాగుపడ్డాల్లేవు. అందుకే ఈ లోకం ఇంకా ఇంత ఛండాలంగా ఉంది. బాగుపడకుండా ఉంది అనుకుంటున్న నన్ను "ఇక చాల్లే నీ బడాయి. బాగుపడ్డావు. పడుకో" అని హెచ్చరించింది, తల్లిలా లాలించింది మనసు.

ఒళ్లు తెలియకుండా హాయిగా నిద్రపట్టింది!

నాకంటే ముందుగా, 'మంచి పని పూర్తిచేసిన తృప్తి'తో నా మనసు గుర్రులోకి జారుకుంది!! ■